మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

సోమవారం MONDAY 4.12.2023 | కరీంనగర్ KARIMNAGAR | పేజీలు: 12+12/8 Pages: 12 +12/8 | సంపుటి (Volume): 13 || సంచిక (Issue): 159 || వెల (Price) రూ.6.50 | PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD | www.ntnews.com /ntdailyonline


# తెలంగాణ తీర్పు.. కాంగ్రెస్ గెలుపు

| మొత్తం స్థానాలు | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ | ఎంఐఎం | సీపీఐ |
|---|---|---|---|---|---|
| 119 | 64 | 39 | 8 | 7 | 1 |

## హస్తానికి 64.. బీఆర్ఎస్‌కు 39 సీట్లు

### కేసీఆర్ రాజీనామా.. ఆమోదించిన గవర్నర్

### ముఖ్యమంత్రి అభ్యర్థిపై నేడు కాంగ్రెస్ నిర్ణయం



ఫలితాల అనంతరం గాంధీభవన్ వద్ద జరిగిన కాంగ్రెస్ సంబురాల్లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అభివాదం

- ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపు
- గజ్వేల్‌లో కేసీఆర్ హ్యాట్రిక్ విజయం
- సిరిసిల్లలో కేటీఆర్, సిద్దిపేటలో హరీశ్ విక్టరీ
- దుబ్బాకలో రఘునందన్‌పై 'కొత్త' గెలుపు
- చాలాచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ హోరాహోరీ
- పలువురు కాంగ్రెస్ సీనియర్లకు ఓటర్ల షాక్!
- జాబితాలో జగ్గారెడ్డి, జీవన్‌రెడ్డి, యాష్కీ
- ఎన్నికల బరిలో దిగిన బీజేపీ ఎంపీలు
- బండి, అర్వింద్, సోయం పరాజయం

హోరాహోరీగా సాగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. రౌండ్ రౌండ్‌కు ఫలితాల్లో మార్పు రాగా చివరికి అధికారానికి అవసరమైన కనీస మెజార్టీని ఆ పార్టీ సాధించింది. మొత్తం 64 సీట్లలో గెలుపొందిన కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకున్నది. ఇప్పటివరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ 39 సీట్లలో గెలుపొందింది. బీజేపీ 8 స్థానాల్లో గెలుపొందగా, ఎంఐఎం మళ్లీ 7 స్థానాల్లో విజయం సాధించింది. ఇక కాంగ్రెస్‌తో పొత్తుతో ముందుకెళ్లిన సీపీఐ ఒక స్థానాన్ని గెలుచుకున్నది.

## మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓటమి

- 'చే'జారిన ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్
- మధ్యప్రదేశ్‌లో మళ్లీ బీజేపీకే పగ్గాలు
- నేడు తేలనున్న మిజోరం ఫలితం
- 2024 విజయానికి ఇదే బాట:మోదీ

భోపాల్/జైపూర్/రాయ్‌పూర్, డిసెంబర్ 3: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. మూడు రాష్ట్రాల్లోనూ బీజేపీ సంపూర్ణ మెజార్టీ సాధించి విజయకేతనం ఎగురవేసింది. వీటిల్లో తాము అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లను హస్తం పార్టీ చేజార్చుకొన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో ఆయా రాష్ట్రాల్లో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు నిర్మానుష్యంగా కనిపించాయి. మధ్యప్రదేశ్‌లో కమలం పార్టీ అధికారాన్ని నిలబెట్టుకున్నది. 230 స్థానాలకుగానూ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ కంటే భారీ స్థాయిలో 163 స్థానాల్లో గెలుపొందింది. ఇక రాజస్థాన్(199)లో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను పడగొట్టిన బీజేపీ 115 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. ఛత్తీస్‌గఢ్‌లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు విరుద్ధంగా బీజేపీ అనూహ్య విజయం సాధించింది. 90కిగానూ 54 నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచారు. దీంతో ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరాదిన మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించి తన పట్టును చాటింది. మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు, ఆ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమికి ఈ ఎన్నికల ఫలితాల ద్వారా తగిన గుణపాఠం చెప్పామన్నారు. అవినీతిలో మునిగిన ఆ పార్టీకి ప్రజలు గట్టి హెచ్చరిక 6వ పేజీలో



## హుందాగా వైదొలగిన కేసీఆర్

- ఎన్నికల ఫలితాల ట్రెండ్ తెలియగానే రాజీనామా
- కాన్వాయ్‌ని వదిలేసి ప్రగతిభవన్‌ను వీడిన కేసీఆర్
- ప్రైవేటు వాహనంలో సొంత నియోజకవర్గానికి
- సామాన్య పౌరుడిలా ట్రాఫిక్‌లో ఆగుతూ ప్రయాణం
- గన్‌మెన్‌ను వెంట రావొద్దని ఒంటరిగానే బయటకు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలైన తర్వాత ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ హుందాగా వ్యవహరించారు. సీఎం పదవి నుంచి హుందాగా వైదొలిగారు. ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత గెలుపు ఓటముల ట్రెండ్స్ తెలియటంతోనే రాజీనామా లేఖ రాసి రాష్ట్ర గవర్నర్‌కు అందించాల్సిందిగా సీఎంవో ప్రధాన కార్యదర్శి నర్సింగరావుకు సూచించి, సాధారణ పౌరుడిలా సీఎం నివాసం ప్రగతి భవన్‌ను నుంచి బయటకు వెళ్లిపోయారు. 'గెలిస్తే పొంగిపోవడం.. ఓడిపోతే కుంగిపోవటం కాదు ప్రజాప్రతినిధుల అంతిమలక్ష్యం. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలి' అని పదేపదే తన క్యాడర్‌కు చెప్పిన కేసీఆర్ అదే ఆదర్శ విలువను అక్షరాలా అనుసరించారు.

**సామాన్యుడిలా..**


ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడటం మొదలైన తర్వాత మధ్యాహ్నం 12 గంటల సమయానికి పార్టీల గెలుపోటముల ట్రెండ్స్ రావటం మొదలైంది. బీఆర్ఎస్ ఓటమి ఖాయమైందని తెలిసిన వెంటనే కేసీఆర్ సీఎం పదవికి రాజీనామా చేశారు. సీఎంవో ప్రధాన కార్యదర్శికి లేఖను అందించి గవర్నర్‌కు సమర్పించాల్సిందిగా 2వ పేజీలో

# సిటీ ఓటు ప్రగతికే



- మహానగరంలోని అన్ని స్థానాల్లోనూ కారుదే హవా
- 29 నియోజకవర్గాల్లో 17 చోట్ల బీఆర్ఎస్ గెలుపు
- 2018లో 19 స్థానాలను గెలుచుకొన్న గులాబీ పార్టీ
- గ్రామీణంలో అదనంగా రెండుచోట్ల బలపడిన కాంగ్రెస్
- సిట్టింగ్ స్థానాలను నిలుపుకొన్న బీజేపీ, మజ్లిస్ పార్టీలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): తొమ్మిదిన్నరేండ్ల హైదరాబాద్ అభివృద్ధికే మహానగర ఓటరు పట్టం కట్టాడు. బీఆర్ఎస్ సర్కారు హైదరాబాద్‌ను విశ్వనగరంగా నిలపడంలో చేసిన కృషికి ప్రతిఫలంగా గులాబీ పార్టీ అభ్యర్థులను ఓటుతో ఆదరించాడు. రాజకీయాలు ఎలా ఉన్నా.. పని చేసిన వారిని వెన్నుతట్టేలా తన తీర్పును ప్రకటించాడు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో గులాబీ పార్టీ హవా కొనసాగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ.. హైదరాబాద్ మహానగరంలో మాత్రం బీఆర్ఎస్ దాదాపు పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. 29 అసెంబ్లీ నియోజకవర్గాలకుగానూ 2వ పేజీలో



## ప్రజాతీర్పును శిరసావహిస్తాం

### ఫలితాలు నిరాశపర్చినా.. బాధేమీ లేదు

- ఇది స్పీడ్ బ్రేకర్ మాత్రమే.. మరింత వేగంగా తిరిగొస్తాం
- **అనుకున్న స్థాయిలో సీట్లు రాలేదు.. తప్పులను సమీక్షించుకుంటాం**
- **కొత్త ప్రభుత్వానికి సహకరిస్తాం.. ప్రతిపక్ష పాత్రను సమర్థంగా నిర్వర్తిస్తాం**
- **కాంగ్రెస్‌కు కంగ్రాట్స్.. బీఆర్ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు: కేటీఆర్**

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశపర్చినా బాధేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. తాము ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదని, ప్రజలు అప్పగించిన ప్రతిపక్ష పాత్రను సమర్థంగా నిర్వర్తిస్తామని చెప్పారు. ప్రతిపక్ష పాత్రలో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామని, కొత్త ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సహకరిస్తామని స్పష్టంచేశారు. ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు తెలియజేశారు. అసెంబ్లీ ఫలితాల అనంతరం ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత 100 రోజులుగా పార్టీ అభ్యర్థుల విజయానికి శ్రమించి, కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు వినమ్రపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. 60 లక్షల మంది బీఆర్ఎస్ కుటుంబసభ్యులు 2వ పేజీలో

## నమ్మకాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి

ప్రజాతీర్పును గౌరవిస్తాం..కాంగ్రెస్‌కు అభినందనలు

శ్రమించిన బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు: హరీశ్ 2

# అంజనీకుమార్ సస్పెన్షన్



ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఫలితాలకు ముందే రేవంత్‌ను కలిసిన డీజీపీ అంజనీకుమార్

- రిజల్ట్‌కు ముందే రేవంత్‌ను కలిసి అభినందన
- కోడ్ ఉల్లంఘించినందుకు ఈసీ చర్యలు
- మరో ఇద్దరు అదనపు డీజీలకు నోటీసులు
- కొత్త డీజీపీగా రవిగుప్తా నియామకం



రవిగుప్తా

హైదరాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): తెలంగాణ నూతన డీజీపీగా రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ అదనపు డీజీ రవిగుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడకముందే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన డీజీపీ అంజనీకుమార్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలుపడాన్ని ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని పేర్కొంటూ ఆయనను సస్పెండ్ చేసింది. అదనపు డీజీలు మహేశ్ భాగవత్, సందీప్‌కుమార్‌జైన్‌కు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడం వల్లే వారిపై చర్యలు తీసుకున్నట్టు ఈసీ తెలిపింది.

### • ఓట్ల తేడా 2 శాతమే

శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య 25 సీట్ల తేడా ఉన్నప్పటికీ, రెండుపార్టీల మధ్య ఓట్ల తేడా 2.04 శాతం మాత్రమే. కాంగ్రెస్‌కు 39.39% ఓట్లురాగా, బీఆర్ఎస్‌కు 37.35 శాతం వచ్చాయి. ఓట్ల పరంగా చూస్తే రెండింటి మధ్య 4.72 లక్షల ఓట్ల తేడా వచ్చింది. ఇక బీజేపీకి 13.9 శాతం ఓట్లు (గతం కన్నా 6.91శాతం ఎక్కువ), ఎంఐఎంకు 2.22 శాతం ఓట్లు లభించాయి.

### • అత్యల్పం, అత్యధికం

ఈసారి ఎన్నికల్లో అత్యధికంగా కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద తన ప్రత్యర్థి కూన శ్రీశైలంపై 85,576 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. తర్వాతి స్థానంలో 82,308ఓట్ల మెజారిటీతో సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్ నిలిచారు. ఇక చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య 268 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు.

### • 2 చోట్లా ఈటల పరాజయం

బీజేపీ నేత ఈటల రాజేందర్ పోటీచేసిన 2 స్థానాల్లోనూ ఓటమి చెందారు. అటు హుజూరాబాద్, ఇటు గజ్వేల్.. రెండుచోట్లా ఆయన పరాజయం పాలయ్యారు. దీంతో ఈటల రాజేందర్ వరుస విజయాలకు బ్రేక్ పడింది.

### • ఆరుగురు మంత్రుల ఓటమి

ఆరుగురు మంత్రులు పరాజితులుగా మిగిలారు. శ్రీనివాస్‌గౌడ్ (మహబూబ్‌నగర్), నిరంజన్‌రెడ్డి (వనపర్తి), ఎర్రబెల్లి దయాకర్‌రావు (పాలకుర్తి), పువ్వాడ అజయ్ (ఖమ్మం), కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి), ఇంద్రకరణ్ రెడ్డి (నిర్మల్) ప్రత్యర్థుల చేతిలో ఓటమి పాలయ్యారు.

### • 51 కొత్త ముఖాలు

ఈసారి 51 మంది అసెంబ్లీలో తొలిసారిగా అడుగు పెట్టనున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు. 51 మందిలో 18 మంది క్రియాశీల రాజకీయాలతో సంబంధం లేనివారే.